

# నేచురల్ సెలక్షన్

- చక్రాల హరిప్రసాద్

**'సతీసహగమనం', 'కన్యాశుల్కం', 'అస్పృశ్యత' వంటివి దురాచారాలని ఇప్పుడు మనకు తెలుసు. ఇప్పుడు అవి తప్పు అని మనం తెలుసుకోగలిగాం కానీ, ఒకప్పుడు సమాజంలో జీవించిన వాళ్ళకు అవి తప్పులని తెలీదు. పైగా అవి ఒప్పులని అనుకునేవాళ్ళు. దురాచారాలంటేనే ఒకప్పుడు ఆచారాలుగా వుండినవని అర్థం.. సమాజం కూడా మనిషిలాగే సహజంగా ఎదుగుతుందన్నమాట. అలా ఎదుగుతున్న సమాజానికి అస్పృశ్యత 'అసహజంగా' కనిపిస్తుంది. ఎందుకంటే, అది తన 'సహజ' పరిణామంలో ముందుకు పోతోంది కనుక.**

ఆ ప్రశ్న మనసులో మెదిలినప్పుడల్లా ఏదో తెలియని అస్పష్టమయిన కదలిక మస్తిష్కం అడుగున కలిగేది... కాని అస్పష్టమయిన ఆ తరంగాల సారాంశం మనసుకు సోకేది కాదు. ఆ రోజుల్లో...

తెల్లవారు జామున లేచి కాలకృత్యాలు తీర్చుకొని వాగువొడ్డున వుండే వేప చెట్టు పుల్లతో దంతధావనం మొదలు పెట్టడంతో ఆనందక్షణాలు మొదలు ప్రతి రోజూ. ఏటి వద్దు నుంచి వచ్చేప్పుడు బొంగరాలు త్రిప్పుకుంటూ, గోలీలు ఆడుకొంటూ నిదానంగా ఒక గంటకు గాని ఇంటికి చేరం.

స్నానం వేసే క్షణాలన్నీ తినబోయే చద్ది అన్నంలో చిట్ల పొడి, చింతకాయ పచ్చడి, గడ్డ పెరుగుల మీదనే. అందుకే స్నానం క్షణాల్లో అయిపోయేది. అమృతం లాంటి చద్ది అన్నం తిని అమ్మ కారేజీలో అన్నం పెట్టేలోపు పుస్తకాల సంచితో రెడీ. మూడున్నర మైలు నడచి పోయి హైస్కూలు చేరుకోవాలి. అందరం ఊరి బయట కలుస్తాం. అందరి మెడలకు నాటు సంచులు, చేతిలో ఇండాలియమ్ కారేజీలు. కొంత మంది సంచుల్లో పేల పిండి పొట్లాలు, కొంతమంది వద్ద బొరుగు ముద్దలు. తినబోయే సరికి అందరూ, అన్నీ రుచి చూసే వాళ్ళు. 'ఏందిరా వాడికి పెట్ట లేదు' అని అడగడం (ఎవరో ఒకరు) 'గోలీల ఆటలో నిన్న రెండు గోలీలు ఎగ్గొట్టాడు వాడు, వాడితోను ఫ్రెండ్ సిప్ లేదు' (ఇంగ్లీషులో మాట్లాడాలనే ట్రయిల్స్) వీడు చెప్పడం, వాళ్ళిద్దరూ క్లోజ్ అయ్యేదాకా ట్రయల్స్, వారు క్లోజ్ అయి మాతో కంటే కూడా వాళ్ళే బాగా మాట్లాడు కొంటుంటే మళ్ళీ మనసులో అసూయ... (హ్యూమన్ వీక్‌నెస్ బాల్యాన్ని కూడా వదల్లేదేమో) వాళ్ళిద్దరికీ మరలా తగూ పెట్టాలని ఒకరిద్దరి ప్రయత్నం.

ఎనీహౌ దార్లో చేలల్లో కంది కాయలు పెసర కాయలూ రేగు పండ్లు కోసుకొని తింటూ రెండున్నర 'మైలు' తర్వాత వచ్చే తారు రోడ్డు ఎక్కుతాం. తారురోడ్డు ఎక్కగానే అందరి మనసుల్లో ఏదో తెలియని సుపీరియర్ ఫీలింగ్. మట్టి దారిలో వుండే అనాగరికపు సహజ, ఉల్లాస గుణం. తారు రోడ్డు ఎక్కగానే మాయమైనట్టు

అనిపించేది. అనాగరికత అంచుదాటి ఏదో నాగరిక ప్రపంచంలోకి అడుగుపెట్టిన ఆనందం. మట్టి దారి పొడవునా అందరినీ అలరించే చల్లని కబుర్లు తారు రోడ్డు లోని వాహనాల రాకపోకల శబ్దాల్తో చెల్లా చెదురు అయిపోయేవి. అయినా అదొక తెనుగుల్లి ఆ ఆనందంలో అసహజత్వం. భోజరాజు సింహాసనం లాగా ఆ రెండుదారుల మతలబు.

స్కూలు నుంచి తిరుగు ప్రయాణంలో కూడా ఇదే తరహా. కాకపోతే కవిలబావుల్లో ఈతలు ప్రత్యేకం. ఇంత ప్రయాణం, ఇంత ఆనందం చివరలో మాత్రం ఆ ప్రశ్న...! ఆ ప్రశ్న నన్ను ఇబ్బంది పెట్టేది, తికమక చేసేది. చదువుతోపాటూ పెరిగే వివేచనా శక్తి నాలో ఆలోచనా రేకెత్తించింది. కాని ఆ ఆలోచనలో సమాధానం దొరికేంత సామర్థ్యం వుండేది కాదు. కాని అప్పుడప్పుడు ఆ ప్రశ్న నాకు ఎదురవుతూనే వుండేది. నేను ఆలోచిస్తూ వుండే వాణ్ణి.

ఇంతకూ ఆ ప్రశ్న... "ఏరా స్కూలుకు పోయేటప్పుడూ వచ్చేటప్పుడూ వాడికి కాస్త దూరంగా వుండు. కారేజీతో వాడిని ముట్టు కుంటున్నావా!"

ఇంటి ప్రక్క తాతాగారు, జ్ఞానీ, మర్యాదస్తుడూ, జాలికలవాడూ, మంచి వాడూ, ఆయన ముట్టకోవద్దనే వాడికి ఆయనే అప్పుడప్పుడూ ఆర్థిక సహాయం చేసేవాడు. కాని ఆయన నుండి ఈ ప్రశ్న ఎందుకు వస్తుందో? అందుకే నా ఆలోచన స్కూలు నుండి వచ్చిన తర్వాత స్నానం చేసి బట్టలు మార్చుకొంటే కాని తన దగ్గరకు రానీయడు.

స్కూలుకు పోయే దారిలో ఒంటికి పోవాల్సినప్పుడు, నా కారేజీ వాడికి పట్టుకోమని ఇచ్చేప్పుడు, కవిల బావిలో నేను ఈత కొట్టేటప్పుడు నా చొక్కావాడు 'వేసుకొన్నప్పుడు వాడితో ఈ ప్రశ్నను గురించి చెప్పేవాణ్ని. దీన్ని వాడు సహజంగా తీసుకొని వయసుకు మించి నా తరహాలో పర్మగర్భంగా నవ్వేవాడు. వాడి కంటే నాలోనే కొంత బాధ వ్యక్తం అయ్యేది. అయినా క్షణంలో దాన్ని మరచిపోయి మామూలుగా అయ్యే వాళ్ళం. నిశ్చలంగ్గా వున్న నీటిలో రాయి పడ్డప్పుడు క్షణికంగా అలజడి కలిగినా, రాయి అడుగుకు చేరి మరలానిశ్చలత చేకూరుతుంది.

నెలలనే ఆకులు గల సంవత్సర చక్రాలతో కాల రథం దొర్లుతూనే వుంటుంది. ఆ రథం అధిరోహించి కొంతమంది పాత గాయాలు మాన్పు కొంటూ సేదతీరుతుంటే, ఆ రథ చక్రాల క్రింద పడి కొత్త గాయాలతో కొందరు బాధ పడుతుంటారు.

మా వాడు ప్రస్తుతం రథంపై వున్నాడు. ఈ రోజు వాడు యూనివర్శిటీలో ఫిలాసఫీ ప్రొఫెసర్. నెలకు ఏడు వేల జీతం. అందమైన జీవితం. వాడి మనస్తత్వానికీ, నిశ్చలత్వానికీ రావల్సిన ఉద్యోగమే అది. నేను బ్యాంకులో గుమస్తాను. చాలా రోజుల తర్వాత కలుసుకున్నాం. సరదాగా కబుర్లు. గత బాల్యానందపు జలాలకు సేతువు కట్టలేక పోతిమే అనే బాధ..., మొత్తానికి బాల్యం లోనే ఆనందం అనే ఏకాభిప్రాయం. మాటల్లో మా యింటి ప్రక్క తాతాగారిని గురించి అడి గాడు. ఆయన గతించిన విషయం చెప్పాను. ఆయన గుర్తుకు రాగానే ఆ ప్రశ్న మళ్ళీ నా మనసులో మెదిలింది. ఆ ప్రశ్నలో వున్న మూఢా చారాన్ని విమర్శిస్తున్న ధోరణిలో యధాలాపంగా వాడికి క్షమాపణ చెబుతున్నట్టు సాగిన నా మాటలను మధ్యలోనే వారించాడు వాడు.

"అస్పృశ్యత అన్నది అమానుషం అనేది నిర్వివాదం. కాని ప్రాగ్మాటిక్ వ్యూలో ఆలోచిస్తే ఆ రోజు ఆయన ఆచారం, ఈ రోజునీ చొరవ కాలానుగుణంగా అబ్బుతున్న సహజ గుణాలు" అన్నాడు.

కొద్దిపాటి ఆశ్చర్యంలో అర్థం కానట్టు చూస్తూ నేను "ప్రొఫెసర్ గారు కాస్త వివరంగా చెప్పాలి" అన్నాను.

ఇద్దరం కాఫీతాగుతున్నాం. వాడు మొదలు పెట్టాడు.

"డార్విన్ మహాశయుని సిద్ధాంతం లోని 'నేచ్యురల్ సెలక్షన్'తో పోలిస్తే మన ప్రశ్నకు కొంత సమాధానం దొరుకుతుంది" అన్నాడు.

"ఆ సిద్ధాంతం నాకు తెలియదు, కాస్త వివరంగా చెప్ప" అన్నాను. వాడు వివరించడం మొదలు పెట్టాడు. నాది గీతలో అర్జునుడి పాత్ర అయింది.

"డార్విన్ శాస్త్రవేత్త భూగోళంపై మానవుడి పుట్టకను వివరించాడు. కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం సముద్రంలో పుట్టిన ఏక కణజీవి. క్రమేణా రూపాంతరం చెంది, చెంది ఉభయ చరజీవిగా పరిణితి పొందింది. అది మరలా రూపాంతరం చెంది చివరి పరిణామంగా భూమిపై మానవుడు అవతరించాడు. ఈ పరిణామ క్రమంలో ఎన్నోరకాల జీవరాసులు తమ శరీర సౌష్ఠవత జీవనానికి అనుగుణంగా లేక నశించి తమ జాతిని అంతం చేసుకొన్నాయి. ఈ పరిణామం చాలా నిదానంగా సహజంగా జరిగింది.

ఈ పరిణామం జరగలేదని వాదించడం ఎంత నిజమంటే 'గడియారంలో గంటల ముల్లు తిరగడం లేదు అని వాదించినంత నిజం' అని ఒక రచయిత వాపోయాడు. అలాగే మానవాకృతి పొందిన జీవి సమాజ వాది (సంఘజీవి) అయిన తర్వాత నుండి పరిశీలిస్తే మన సమాజం కూడా పై విధమైన మార్పులకు గురవుతూ వస్తుంది. ఈ భావనను 'ప్రాగ్మాటిజమ్' అంటారు. ఆ పరిణామంలో, భాగంగా కులాల, మతాలు, ఆచారాలు, మూఢాచారాలు వివేచనాశక్తితో రేగిన వివిధ సంఘర్షణల సత్ఫలితంగా అంతరిస్తున్నాయి.

సిగరెట్ వెలిగించి మరల మొదలు పెట్టాడు. "అలాగే మీ యింటి ప్రక్క పెద్దాయనే కూడా ఆచార పరిణామ దశలో ఒక భాగం. నీవు మరొక భాగం..."

వాడు ఇలా చెప్పకొంటూ పోతుంటే నా మెదడులో ఏదో శృంఖల చర్య మొదలయింది. శృంఖల చర్య వల్ల ఆటంబాంబులో శక్తి విడుదల అయినట్లు నా మస్తిష్కం అడుగు పొరల నుండి కూడిన అవగాహన తరంగాలు జ్ఞాన తలాన్ని చేరుతున్న అనుభూతి కలిగింది. కాని ఆ అవగాహనలో ఏదో వెలితి... అసంతృప్తి...!

తర్వాత కొంత సేపటికి మా వాడికి సెండాఫ్ ఇచ్చి యింటికి పోతున్నా దారిలో ఆలోచనలు వాడితో జరిగిన చర్చపైనే కేంద్రీకృతం అయింది. వాడి సమాధానంలో మొత్తానికి ఏదో 'క్లూ' వున్నట్టు అనిపించింది.

తాతగారి తర్వాతి తరం అయిన మా నాన్న గారు నన్ను స్కూలు గుడ్డల తోనే ఇంటికి రానిచ్చేవారు. ఆ రోజుల్లో నాకు వాడిని తాకడంతో అభ్యంతరం లేదు కాని వాడి కేరేజీలో పదార్థం నేనెప్పుడూ తినలేదు (అవసరం వచ్చినా). కానీ ఈ రోజు వాడి ప్లేటులో ఎక్కువయిన ఇడ్లీ నేను తిన్నాను. ఇలా కొన్ని సంఘటనలు మా వాడి సిద్ధాంతాల్ని బలపరుస్తున్నా నా అవగాహనలో అసంతృప్తి వుంది. నిజమే. మూఢాచారాలు అంతరించే పరిణామం ఇంకా పూర్తి కాలేదుగా...!

ఆలోచనల్లో ఇంటికి చేరిన నాకు 'డాడీ' మా అంటూ మా అబ్బాయి ఎదురొచ్చాడు. "డాడీ... డాడీ, రేపు నా బర్త్ డేకి నా క్లాస్ మేట్ జాన్‌నీ, వాళ్ళ చెల్లెళ్ళీ భోజనానికి పిలిచాను..." ఇంకా వాడేదో చెబుతున్నాడు.

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్